


**రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం**
జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి పండగ సందడి నెలకొంది. అన్ని దేవాలయాల్లో ఏర్పాట్లు చేశారు. 8లో





**దళారులను నమ్మొద్దు**
పోలవరం నిర్వాసితులు దళారుల మాటలు విని మోసపోవద్దని ఎస్‌డీసీ వరద సుబ్బారావు అన్నారు. 8లో





**క్షమించండి.. వెళ్లిపోతున్నాం**
ఉక్కు ఉద్యోగి దంపతుల సెల్ఫీ వీడియో కలకలం సృష్టించింది. ఏలేరు కాల్వ వద్ద వారి సామగ్రి లభించడంతో గాలిస్తున్నారు. 8లో


**రంజాన్ వేళలు**

అరకు/పాడేరు:
ఇఫ్తార్ (బుధ) 6-10 సహర్ (గురు) 4-39

రంపచోడవరం :
ఇఫ్తార్ (బుధ) 6-25 సహర్ (గురు) 4-42

# 'మహా' నమామి



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న విదేశీ ప్రతినిధి



సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్

- హాజరైన జీ20 దేశాల ప్రతినిధులు
- విమానాశ్రయంలో అతిథులకు సంప్రదాయ స్వాగతం
- తొలి రోజున మూడు అంశాలపై విస్తృతంగా చర్చలు
- విదేశీ ప్రతినిధులతో సీఎం వైఎస్ జగన్ సమావేశం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి, విశాఖపట్నం : జీ20 దేశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్(ఐడబ్ల్యూజీ) రెండో దశ సమావేశాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జనవరిలో పూణేలో నిర్వహించిన ఐడబ్ల్యూజీ సదస్సుకు కొనసాగింపుగా రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో ఈ సదస్సు నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిరోజు సాయంత్రం సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'అద్భుత నగరం విశాఖలో మీరు గడిపిన సమయం ప్రతి ఒక్క అతిథికి మధురానుభూతి మిగులుస్తుందని' సీఎం వైఎస్ జగన్ స్పష్టం చేశారు. అనంతరం జీ-20 దేశాల ప్రతినిధులతో పాటు వివిధ రంగాల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి గాలా డిన్నర్ పేరుతో ప్రత్యేక ఆతిథ్య విందుని ప్రారంభించారు. తరువాత 14 దేశాల ముఖ్యులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తొలిరోజు సదస్సుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆర్థిక నగరాల సుస్థిరత, స్థితిస్థాపకత అంశంపై తొలి సెషన్‌లో వివిధ దేశాల ప్రతినిధులు చర్చించారు. అనంతరం.. భవిష్యత్తులో ఆర్థిక నగరాలుగా అభివృద్ధి చెందనున్న దేశాల్లో రాబోతున్న మార్పులపై రెండో సెషన్‌లో చర్చించారు. ప్రపంచ బ్యాంకుకు సంబంధించి క్వాలిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్(క్యూఐఐ) సూచీలపై చివరి సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి అనే అంశంపై వివిధ దేశాల ప్రతినిధులు రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొని తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. ఈ సదస్సులో జీ-20 సభ్యదేశాల ప్రతినిధులు, 8 అతిథి దేశాలకు చెందిన ప్రతినిధులు, 10 అంతర్జాతీయ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.



సాంస్కృతిక కార్యక్రమాల్ని మొబైల్‌లో బంధిస్తున్న మంత్రి రోజా, విదేశీ ప్రతినిధులు



గాలా డిన్నర్‌లో పాల్గొన్న విదేశీ ప్రతినిధులు

## ఆతిథ్యం.. అదిరింది





విమానాశ్రయంలో విదేశీ అతిథులకు సంప్రదాయ స్వాగతం

జీ 20 సదస్సులో పాల్గొనేందుకు ఇందులో సభ్యులుగా ఉన్న 15 దేశాలకు చెందిన ప్రతినిధులు విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో విదేశీ ప్రతినిధులకు తెలుగు సంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలికారు. అతిథులకు కూచిపూడి నృత్యంతో స్వాగతం పలికి.. పూలమాలలు, శాలువా వేసిన అనంతరం.. కుంకుమ బొట్టు పెట్టి.. నగరానికి ఆహ్వానించారు. ప్రభుత్వం చేసిన ఏర్పాట్లకు విదేశీ ప్రతినిధులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆతిథ్యం అదిరిపోయిందంటూ.. సదస్సుల్లో పలు దేశాల ప్రతినిధులు తమ అభిప్రాయాల్ని వెలిబుచ్చారు. తొలిరోజు సదస్సు ముగిసిన అనంతరం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అతిథులకు గాలా డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా వంటకాలతో పాటు.. భారత్‌లో ప్రసిద్ధి చెందిన రుచుల్ని అందించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆతిథ్యానికి విదేశీ అతిథులు ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా వాహ్వా అనిపించాయి. కొమ్ము నృత్యం నుంచి కూచిపూడి వరకు, భరతనాట్యం, కథాకళితో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ప్రధాన నృత్యాలు ప్రదర్శించారు. అదేవిధంగా.. పలు పౌరాణిక పాత్రలతో ఏక పాత్రాభినయాలు మంత్రముగ్ధుల్ని చేశాయి.







# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం





ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మేయర్ హరి వెంకట కుమారి, డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

గోపాలపట్నం: విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీ-20 సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. సాయంత్రం 7.05 నిమిషాలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న ఆయన ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాడిషన్ బ్లూ హోటల్‌కు బయలుదేరారు. అక్కడ విదేశీ ప్రతినిధులతో సమావేశమై.. తిరిగి రాడిషన్ బ్లూ నుంచి విశాఖ విమానాశ్రయానికి రాత్రి 9.10 గంటలకు చేరుకున్నారు. 9.21 గంటలకు ప్రత్యేక విమానంతో గన్నవరానికి బయలు దేరారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ఆర్.కె.రోజా, మేరుగ నాగార్జున, విప్ కరణం ధర్మశ్రీ, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, గొల్ల బాబూరావు, కె.భాగ్యలక్ష్మి, చెట్టి ఫాల్గుణ, వెంకటరమణ మూర్తి రాజు, ప్రత్యేక కార్యదర్శులు శ్రీలక్ష్మి, ఎస్.రజిత్ భార్గవ్, కలెక్టర్ మల్లికార్జున, సీపీ సీహెచ్ శ్రీకాంత్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

## జీ-20 సదస్సు పైలాన్ జాతికి అంకితం

బీచ్‌రోడ్డు: జీ-20 సదస్సు చిరకాలం గుర్తుండిపోయేలా వీఎంఆర్డీఏ పార్కులో ఏర్పాటు చేసిన పైలాన్‌ను మంగళవారం రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ జాతికి అంకితం చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పైలాన్‌ను జాతికి అంకితం చేస్తున్న మంత్రులు ఆదిమూలపు సురేష్, అమర్‌నాథ్ తదితరులు

## విదేశీయులు మెచ్చిన గిరిజన ఉత్పత్తులు





స్టాల్స్‌లో జీసీసీ ఉత్పత్తులు, లేపాక్షి, చేనేత, హస్తకళా రూపాలు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో కళాకారుల హస్తకళా ప్రతిభకు జీ20 సభ్యదేశాలకు చెందిన ప్రతినిధులు ముగ్ధులయ్యారు. రాడిసన్ బ్లూ హోటల్‌లో ప్రారంభమైన జీ-20 సభ్యదేశాల సదస్సులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పలు స్టాళ్లు ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) సేకరించి బ్రాండింగ్ కల్పిస్తూ మార్కెటింగ్ చేస్తున్న గిరిజన ఉత్పత్తుల స్టాల్‌తో పాటు రాష్ట్ర వైభవాన్ని ప్రస్ఫుటించే లేపాక్షి, చేనేత, హస్తకళా రూపాల స్టాల్స్ అందర్నీ ఆకట్టుకున్నాయి. విదేశీయులకు వైభవాన్ని, గిరిజనుల కష్టాన్ని చూపించే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీసీసీ చైర్‌పర్సన్ శోభస్వాతిరాణి గిరిజన ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## న్యూస్‌రీల్

### 31న మానసిక రోగుల కోసం వైద్య శిబిరాలు

రాజవొమ్మంగి: మానసిక రోగుల కోసం పీహెచ్‌సీల్లో ఈనెల 31న ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్టు మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రామారెడ్డి తెలిపారు. ఆ శిబిరాల్లో రోగులకు ఉచిత వైద్యసహాయం, కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్టు చెప్పారు. గంగవరం పీహెచ్‌సీలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, ఎల్లవరం పీహెచ్‌సీలో 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, రాజవొమ్మంగి పీహెచ్‌సీలో 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

### కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

మారేడుమిల్లి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మయూరి లక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం హెచ్ఈసీ గ్రూపు(ఇంగ్లిష్ మీడియం), ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల బాలికలు ఏప్రిల్ 20 తేదీలోగా apkgbv.apcfss.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుల చేసుకోవాలని కోరారు. అనాథ పిల్లలతో పాటు బడిబయట పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బాలికలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్‌లో బోధనతో పాటు ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9491407336, 9392984039 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

### ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్

చింతపల్లి: పాలిసెట్ కోసం గిరిజన విద్యార్థులకు పోలీస్‌శాఖ కల్పిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. పాలిసెట్ రాసే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు చింతపల్లి,గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల్లో మంగళవారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చింతపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ప్రతిభ చూపిన 120 మందిని ఎంపిక చేసి 20 రోజుల పాటు అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణ కాలంలో విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

### అర్హులకు ఆర్థిక చేయూత

**స్పాన్సర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం**



సీడీపీవో రమ్య

చింతపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకం కింద స్పాన్సర్‌షిప్‌కు అర్హులైన బాలలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో రమ్య తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. 18 సంవత్సరాలలోపు వయసు గల, రక్షణ,సంరక్షణ అవసరమైన వారి కనీస అవసరాలను తీర్చేందుకు ప్రతి నెలా ఆర్థిక చేయూత అందించటం జరుగుతుందన్నారు. ఆర్థిక, వైద్య,విద్య,అభివృద్ధి ఇతరత్రా అవసరాలను తీర్చేందుకు మిషన్ వాత్సల్య కింద షరతులతో కూడిన సహాయం అందిస్తారని, స్పాన్సర్‌షిప్‌కు ఎంపికైన పిల్లలకు నెలకు రూ.4 వేలు ఇస్తారని ఆమె తెలిపారు.ఏప్రిల్ 15 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ విషయంపై ఎటువంటి సందేహాలు ఉన్నా చింతపల్లి ఐసీడీఎస్ కార్యలయాన్ని సందర్శించాలని తెలిపారు.

## ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

**కలెక్టర్ సుమిత్ కుమార్**



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్ కుమార్

అరకులోయ రూరల్: ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలో పరిశుభ్రతపై ఆరా తీసి, రికార్డులు, వార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో వైద్య సేవలందించేందుకు కృషిచేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మన్యంలో శిశు మరణాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అన్ని మండల కేంద్రాల్లో గర్భిణుల కోసం వసతి గృహాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు రూ.40 కోట్ల రుణాలు

- మంజూరు చేయాలన్నది వచ్చే ఆర్థిక సంవత్సర లక్ష్యం
- స్త్రీనిధి ఏజీఎం కామరాజు



వెలుగు సిబ్బందికి సూచనలు ఇస్తున్న స్త్రీనిధి ఏజీఎం కామరాజు

రాజవొమ్మంగి: వచ్చే ఆర్థికసంవత్సరంలో జిల్లాలోని మహిళా స్వయం సహాయ గ్రూపు సభ్యులకు రూ.40 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు స్త్రీనిధి ఏజీఎం పి.కామరాజు తెలిపారు. కేవలం 90పైసల వడ్డీతో అందజేస్తున్న ఈ రుణాలను మహిళలు తమ జీవనోపాధులను మెరుగుపరచుకోడానికి మాత్రమే ఉపయోగించుకోవాలని తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనం సమావేశం హాలులో వీవోఏలు, సీసీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు తీసుకొన్న రుణాలు ఎన్‌పీఏ (నాన్ ఫెర్ఫార్మెన్స్ అసెట్స్) కాకుండా చూడాల్సిన బాధ్యత ఆయా వీవోఏలు, సీసీలు, ఏపీఎంలదేనని చెప్పారు. రుణ బకాయిలు ఉన్న క్లస్టర్లలోని రికవరీ శాతం పడిపోయిన గ్రూపులకు చెందిన వివరాలు సేకరించారు. బయోమెట్రిక్ ద్వారానే స్త్రీనిధి రుణం మంజూరు చేస్తున్నామని, దీని వల్ల అవకతవకలకు అవకాశం లేదన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది ఇచ్చిన స్త్రీనిధి రుణాలకు సంబంధించి దాదాపు రూ.3.64 కోట్ల బకాయిలు పేరుకుపోగా కేవలం నెల వ్యవధిలో ఆ మొత్తాన్ని రూ.99 లక్షలకు తగ్గించగలిగామని చెప్పారు. రంపచోడవరం డివిజన్‌కు చెందిన అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లోనే రికవరీ శాతం బాగా తక్కువగా ఉందని చెప్పారు. జిల్లాలో దాదాపు 11వేల మహిళాగ్రూపులు ఉండగా ఒక్కో గ్రూపులో కనీసం ఐదుగురికి రూ.50 వేల చొప్పున స్త్రీశక్తి రుణాలు ఇస్తున్నామన్నారు. ఈ మొత్తాన్ని లబ్ధిదారులు 24 నెలల్లో నెలకు రూ.2,500 చొప్పున వడ్డీతో సహా చెల్లించాలని, అప్పు తీరిన తరువాత వడ్డీ రాయితీ లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. మండలానికి రూ.2 కోట్ల చొప్పున స్త్రీనిధి రుణాల మంజూరుకు ఏర్పాట్లు చేశామన్నారు. స్త్రీనిధి మేనేజర్ ప్రవీణ్‌కుమార్, ఏపీఎం ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్న హుండీ ఆదాయం రూ.2.06 కోట్లు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గడిచిన 41 రోజులకు గాను 2కోట్ల 6లక్షల11వేల 210 రూపాయలు వచ్చినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 100.600 గ్రాముల బంగారం, 12.495 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం అధికారులు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీపై ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు

**ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే**



మాట్లాడుతున్న పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే

చింతూరు: డివిజన్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే హెచ్చరించారు. ఇప్పటికే కొన్ని ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో జీసీసీ అధికారులు, ఎంఎల్ఎస్ ఇన్‌చార్జులు, రేషన్‌డీలర్లు, సంచార వాహనాల ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఎల్ఎస్ ఇన్‌చార్జులు నెలాఖరులోగా రేషన్ సరకులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఐదవ తేదీలోగా సంచార వాహనాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు సరకులను చేరవేయాలన్నారు. ఎక్కడైనా అవకతవకలు జరిగినట్టు తన దృష్టికి వస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శివప్రసాద్, సహాయ పౌరసరఫరాల అధికారి శ్రీహరి, జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, జీసీసీ మేనేజర్ రాజారెడ్డి, తహసీల్దార్ సాయికృష్ణ పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు సీఎం కృషి

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- అడ్డతీగల, గంగవరంలో వైఎస్సార్ ఆసరా చెక్కుల అందజేత



అడ్డతీగలలో వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి తదితరులు



గంగవరంలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

అడ్డతీగల/గంగవరం: రాష్ట్రంలో మహిళల సాధికారతకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. అడ్డతీగల, గంగవరం మండల కేంద్రాల్లో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను మంగళవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో మూడు దఫాలతో కలిపి ఇప్పటివరకూ 4,761 స్వయం సహాయక సంఘాల్లోని 47,617 మంది అక్క చెల్లెమ్మలకు రూ.60 కోట్లు అందజేశారని చెప్పారు.మూడవ విడతలో ఒక్క అడ్డతీగల మండలంలో 505 స్వయం సహాయక సంఘాలకు రూ.2.18 కోట్లు, గంగవరం మండలంలో 330 మహిళా సంఘాలకు మూడు విడతల్లో సుమారు రూ.మూడు కోట్లు అందజేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా గంగవరంలో డ్వాక్రా సభ్యులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అడ్డతీగలలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల సత్యనారాయణ,జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కారు రాంబాబు, ఎంపీపీ బొడ్డపాటి రాఘవ,జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, వైస్ ఎంపీపీలు కరణం వీర వెంకట సత్యనారాయణ,గంధం బాలసుబ్రహ్మణ్యం,ఎంపీడీవో కె.బాపన్నదొర,సెర్ప్ ఏపీఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. గంగవరంలో జరిగిన సమావేశానికి ఎంఎంఎస్ అధ్యక్షురాలు శారపు పావని అధ్యక్షత వహించారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, వెలుగు ఏపీడీ అల్లాడి శ్రీనివాసరావు, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బేబీరత్నం, వైస్ ఎంపీపీలు కుంజం గంగాదేవి, కె.రామతులసి, కోఆప్షన్ సభ్యుడు ప్రభాకర్, సర్పంచ్ అక్కమ్మ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో ఒడిశావాసి మృతి


ఘటనా స్థలంలోని చిదంబర్ మృతదేహం

చింతూరు: బొడ్డుగూడెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన చిదంబర్ (60) మృతి చెందారు. ఒడిశా రాష్ట్రం కొరాపుట్‌కు చెందిన ఓ కుటుంబం హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు బొడ్డుగూడెంలోని బాలికల ఆశ్రమ పాఠశాల ఎదురుగా అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో చిదంబర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురికి గాయాలు కావడంతో సమీపంలోని ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం తరలించారు. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యుత్ తీగ తగిలి బాలుడికి తీవ్ర గాయాలు


108 వాహనంలో ఆస్పత్రికి బాలుడిని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

హుకుంపేట: మండలంలోని మత్స్యపురం గ్రామంలో బాలుడికి విద్యుత్ తీగ తగిలి తీవ్ర గాయలయ్యాయి. గ్రామానికి చెందిన జి.సుమతి, బొజ్జన్న కుమారుడు అజయ్ (11) మంగళవారం ఇక్కడ పెదగరువు వంతెన సమీపంలో తన స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అక్కడ నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. హుకుంపేట ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో బాలుడు ఆరో తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పెదగరువు వంతెన సమీపంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం

- జిల్లా అంతటా నవమి సందడి
- ఏర్పాట్లలో ఉత్సవ కమిటీలు తలమునకలు


శ్రీరామగిరి సుందర సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ

సాక్షి,పాడేరు: శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. వీఆర్ పురం మండలం శ్రీరామగిరి సుందర సీతారామచంద్రస్వామి వారి ఆలయంతో పాటు అన్ని దేవాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పాడేరు మండలంలోని సుంద్రుపుట్టు,డోకులూరు, రాములపుట్టు,దబ్బాపుట్టు,కొత్తూరు గ్రామాల్లోని రామాలయాల్లో పెళ్లిరాట కార్యక్రమంతో మంగళవారం ఉత్సవాలను ప్రారంభించారు.రాములపుట్టులో సర్పంచ్ గబ్బాడ చిట్టిబాబు,గ్రామపెద్దలు సుబ్బారావు,రంగారావు,నాగరాజుల ఆధ్వర్యంలో గిరిజనులు రామాలయంలో పూజలు జరిపారు.సుంద్రుపుట్టులో ఉత్సవాల ప్రారంభానికి అన్ని వర్గాల భక్తులు భారీగానే తరలివచ్చారు.

వీఆర్‌పురం: నవమి వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన విధంగా బందోబస్తు నిర్వహించాలని చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. శ్రీరామగిరిలోని సుందర సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 30న నిర్వహించనున్న నవమి ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. వేడుకలకు ఎంతమంది భక్తులు వచ్చే అవకాశం ఉంది, కల్యాణ సమయంలో ఏయే ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది అనే విషయాలను ఆలయ ప్రధాన అర్చకుడు సౌమిత్రి పురుషోత్తమాచార్యులను అడిగి తెలుసుకున్నారు.అనంతర పార్కింగ్ ఏరియా, గోదావరి బోట్ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులుగ్యాస్ పొయ్యిలను తగిన రక్షణతో ఏర్పాటు చేసుకునేలా సూచనలు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. సీఐ గజేంద్ర, స్థానిక ఎస్‌ఐలు తెల్లం దుర్గాప్రసాద్,కూనవరం ఎస్‌ఐ బి.వెంకటేష్,సర్పంచ్ పులి సంతోష్ ,ఆలయ కమిటీ చైర్మెన్ రేవు బాలరాజు,సచివాలయ కన్వీనర్ల మండల ఇంచార్జ్ బొడ్డు సత్యనారాయణ , ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు పాల్గొన్నారు.

## థ్యాంక్యూ సీఎం సార్

### ఆజన్మాంతం రుణ పడి ఉంటాం


కూనవరంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

కూనవరం: తమ సామాజిక వర్గానికి దేవాలయాల పాలక మండళ్లలో స్థానం కల్పించడంతో పాటు పలు పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నాయీ బ్రాహ్మణులు ఆజన్మాంతం రుణపడి ఉంటారని నాయీ బ్రాహ్మణుల రాష్ట్ర సమితి కార్యదర్శి మాచవరపు సత్యనారాయణ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు అయినపర్తి ఉషారాణి అన్నారు. నాలుగు మండలాల నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో మంగళవారం కూనవరం బస్‌స్టాండ్ సెంటర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ తరతరాల నుంచి కనీస గుర్తింపునకు నోచుకోని నాయీ బ్రాహ్మణులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక తగిన గుర్తింపు లభించిందని చెప్పారు. కేశఖండన శాలలో పని చేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సాసీపీ ప్రభుత్వమేనని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయీబ్రాహ్మణుల కులపెద్దలు మండా దుర్గాప్రసాద్, సూర్యనారాయణ, జిల్లా సమితి కన్వీనర్ ఎం.వి.రాజు, కె.వెంకట్రావు, జిల్లా యువజన అధ్యక్షుడు గున్నపల్లి శేషగిరి,కో కన్వీనర్ గోల్కొండ కొండబాబు, ఎం.శ్రీను, వై.శ్రీను, డి.రాజేష్, కాసులు, రాము,సూరిబాబు, రమేష్ పాల్గొన్నారు.

## వేలానికి కలప సిద్ధం


చింతూరు డిపోలో టేకు కలప

చింతూరు: వేలం వేసేందుకు స్థానిక ప్రభుత్వ కలప డిపోలో 37,150 చదరపు అడుగుల టేకు కలప సిద్ధంగా ఉందని చింతూరు అటవీ డివిజన్ డీఎఫ్‌వో సాయిబాబా మంగళవారం తెలిపారు. ఇందులో 12,800 చదరపు అడుగుల బాజులు, 21,600 చదరపు అడుగుల దూలాలు, 2,400 చదరపు అడుగుల కర్రలు, 350 చదరపు అడుగుల పలక సైజుల్లో కలప నిల్వ ఉన్నట్టు ఆయన తెలిపారు. ప్రతినెలా 3, 17 తేదీల్లో చింతూరు అటవీ డిపోలో ఉదయం వేలం పాట నిర్వహిస్తున్నట్టు డీఎఫ్‌వో తెలిపారు.

## సక్రమంగా నిత్యావసర సరకుల పంపిణీ

### జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి శివప్రసాద్


జీఎం వలస ఎంపీపీ పాఠశాల వద్ద వివరాలు తెలుసుకుంటున్న శివప్రసాద్

మారేడుమిల్లి: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర సరకులను సకాలంలో పంపిణీ చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆర్.శివప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని గుజ్జుమామిడి వలస గ్రామంలో డీఆర్ డిపో, అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. సరకుల పంపిణీపై ఆరా తీశారు. అంగన్‌వాడీకి, మధ్యాహ్నం భోజనం పథకానికి అందిస్తున్న సరకుల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. గణేష్, సహాయ పౌరసరఫరాల అధికారి శ్రీహరి, జీసీసీ మేనేజర్ ఎం.ఎస్. రాజా రెడ్డి పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి జీవితకాలం రుణపడి ఉంటాం


మాట్లాడుతున్న సరస్వతి

కొయ్యూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవిత కాలం రుణపడి ఉంటామని దొడ్డవరానికి చెందిన కనిగిరి సరస్వతి తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేసిన సాయం ఎన్నటికి మరవలేమన్నారు. కొద్ది రోజుల కిందట పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ బడుగు రమేష్ చేతుల మీదుగా సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.4.5 లక్షల చెక్కును అందుకున్నామన్నారు.తన కొడుకు చంద్రశేఖర్ అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం సచివాలయ కార్యదర్శిగా చేసే వారన్నారు. కిందటి సంవత్సరం తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ద్వారా తెలియజేయడంతో స్పందించి ఆదుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి, ఎంపీపీ రమేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నిర్వాసితులకు అండగా ప్రభుత్వం


గ్రామసభలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్

చింతూరు: పోలవరం ముంపునకు గురవుతున్న నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చింతూరు ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్ అన్నారు. సర్పంచ్ కారం కన్నారావు అధ్యక్షతన పోలవరం పరిహారం, పునరావాసం(ఆర్‌అండ్‌ఆర్)గ్రామసభ మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తరచూ వరద ముంపునకు గురవుతున్న దృష్ట్యా రెండోదశ పరిహారంలో ఉన్న చింతూరును ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో గుర్తించి తొలిదశలో చేర్చడం జరిగిందన్నారు. అధికారులు ప్రకటించిన ముంపు జాబితాలో ఎవరి వివరాలైనా నమోదు కాకుంటే దరఖాస్తు రూపంలో అధికారులకు వివరాలు అందచేయాలని సూచించారు. పార్టీలకతీతంగా ప్రతి నిర్వాసితుడికి న్యాయం జరిగేలా రాజకీయ పార్టీలు కృషి చేయాలని, గ్రామసభల్లో ఆందోళనలు చేయడం ద్వారా అర్హులకు అన్యాయం జరిగే అవకాశముందన్నారు. మంగళవారం నిర్వహించిన గ్రామసభలో 7, 8, 9, 10, 11, 13 క్లస్టర్ల పరిధిలోని కుటుంబాల సమాచారాన్ని అధికారులు వెల్లడించారు. చింతూరు యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విక్టర్‌బాబు, తహసీల్దార్ సాయికృష్ణ, ఎంపీడీవో రవిబాబు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

## దళారులను నమ్మొద్దు

### ఎస్‌డీసీ వరద సుబ్బారావు


అడివివెంకన్నగుడెం గ్రామ సభలో మాట్లాడుతున్న ఎస్‌డీసీ లక్ష్మీపతి

కూనవరం: పోలవరం ముంపు నిర్వాసితులకు నష్టపరిహారం అందించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) వరద సుబ్బారావు అన్నారు. టేకులబోరు గ్రామంలో మంగళవారం ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ సర్పంచ్ కట్టం రాజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరదలకు తరచూ ముంపునకు గురవుతున్న 17 గ్రామాలను ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతగా గుర్తించి గ్రామసభలు చేపట్టిందన్నారు. టేకులబోరులో సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వే ఆధారంగా పరిహారం, పునరావాసం కల్పించనున్నట్టు తెలిపారు. ఈ విషయంలో నిర్వాసితులు దళారుల (మధ్యవర్తుల) మాటలు విని మోసపోవద్దన్నారు. ఇప్పటికే వలంటీర్ల వద్ద సెస్ సమాచారం ఉందని, గ్రామసభలో చదివి వినిపిస్తారని తెలిపారు. అందులో పొరపాట్లు దొర్లితే దరఖాస్తు ద్వారా తెలియజేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, తహసీల్దార్ కె.అనసూయ, వైస్ ఎంపీపీ బండారు సాంబశివరావు, కూనవరం ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, కార్యదర్శి సురేష్, వీఆర్‌వో పిట్టల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**199 అభ్యంతరాలు**

వీఆర్‌పురం: పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామం అడవివెంకన్నగూడెం(ఏవీ గూడెం)లో మంగళవారం నిర్వహించిన ఆర్‌అండ్‌ఆర్ గ్రామ సభలో ఆధార్, బ్యాంక్ తదితరాలపై 199 అభ్యంతరాలు వచ్చినట్టు స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) లక్ష్మీపతి తెలిపారు. ఎస్‌ఈఎస్ ప్రకారం గ్రామంలో 295 నిర్వాసిత కుటుంబాలను గుర్తించినట్టు చెప్పారు.అనంతరం తహసీల్దార్ ఎస్.శ్రీధర్ అర్హుల జాబితాను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌ఆర్ కమిటీ సభ్యుడు ఉండవల్లి గాంధీబాబు,జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి,సర్పంచ్ బుచ్చమ్మ,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో వైద్యుల నియామకం


ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరె

కూనవరం: కోతులగుట్ట సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో పూర్తిస్థాయి వైద్యుల నియామకాన్ని త్వరలో చేపడతామని చింతూరు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సూరజ్ గనోరె తెలిపారు. మంగళవారం సీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ల్యాబ్‌లో రక్తనమూనాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య పరీక్షల నిమిత్తం రోగులను బయటకు పంపితే కఠినచర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

మారేడుమిల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మంగళవారం కాకినాడ జీజీహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మారేడుమిల్లి ఎస్సై రాము వివరాల ప్రకారం.. మండలంలోని తాడేపల్లి పంచాయతీ పరిధి కొడవడిలంక గ్రామానికి చెందిన కత్తుల శ్రీనివాసు రెడ్డి (32), డివికోట గ్రామానికి చెందిన తుంబుడు మంగిరెడ్డి సోమవారం మారేడుమిల్లికి ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా రంపచోడవరం రహదారిలోని టేక్ ప్లాంటేషన్ వద్ద చింతూరు వైపు వెళ్తున్న మినీ వ్యాను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇరువురిని తొలుత రంపచోడవరం, తర్వాత రాజమహేంద్రవరం తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం కాకినాడ జీజీహెచ్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ శ్రీనివాసు రెడ్డి మృతి చెందాడు.

## లారీ, బైక్ ఢీ

### యువకుడి దుర్మరణం


ఘటనా స్థలంలో వెంకటేష్ మృతదేహం

ఎటపాక: మండలంలోని లక్ష్మీపురం జాతీయ రహదారి– 30లో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందాడు. గొమ్ముకోయగూడెం గ్రామానికి చెందిన మడకం వెంకటేష్ (29) తన ద్విచక్ర వాహనంపై నెల్లిపాక నుంచి చింతూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చింతూరు వైపు నుంచి భద్రాచలం వెళ్తున్న ఐరన్‌లోడ్ లారీ (టీఎస్16టీ9127) లక్ష్మీపురం గ్రామం వద్ద ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేష్ తల నుజ్జునుజ్జు కావటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## శిశుమరణాల నిరోధానికి ప్రత్యేక చర్యలు

### అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: జిల్లాలో శిశు మరణాల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, వైద్య బృందాలను పంపేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని హామీ ఇచ్చారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. ఇటీవల పలు గ్రామాల్లో చోటుచేసుకుంటున్న శిశు మరణాలను వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆయన చెప్పారు. మంగళవారం విశాఖలో మంత్రిని కలిసి పెదబయలు మండలం కుంతుర్లలో ఇద్దరు శిశువులు మృతిచెందిన విషయంతో పాటు ఇతర ప్రాంతాల్లో శిశుమరణాల వివరాలను తెలియజేశానని తెలిపారు. వెంటనే స్పందించిన ఆమె వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌తో మాట్లాడి, శిశుమరణాల నిరోధానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని చెప్పారు. ఏజెన్సీలో శిశు ఆరోగ్య కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే పాల్గుణ తెలిపారు.

## బోయ, వాల్మీకులను ఎస్టీలో జాబితాలో చేర్చటం తగదు

### మావోయిస్టు ఆంధ్ర-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్

జి.మాడుగుల: బోయ, వాల్మీకులను, బొంతిరియ కులాలను ఆదివాసీ జాబితాలో చేర్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆదివాసేతర బడా భూస్వాముల కార్పొరేటు సంస్థల ప్రయోజనాలు నెరవేర్చడానికేనని సీపీఐ మావోయిస్టు ఆంధ్ర–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక విలేకర్లకు మంగళవారం మావోయిస్టు పార్టీ నుంచి ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీలకు జల్, జంగల్, జమీన్‌పై హక్కులను, అధికారాన్ని కాలరాసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. బోయలు, వాల్మీకులను ఎస్టీలో చేర్చడాన్ని ప్రతిపక్ష టీడీపీ, బీజేపీలు కూడా సమర్థించి, తమ వర్గ స్వభావాన్ని చాటుకున్నాయని ఆ ప్రకటనలో విమర్శించారు.

## క్షమించండి.. వెళ్లిపోతున్నాం

- నంచలనం రేపిన ఉక్కు ఉద్యోగి, అతని భార్య సెల్ఫీ వీడియో
- కొప్పాకలోని ఏలేరు కాలువ వద్ద బైక్, చెప్పులు, బ్యాగు, ఫోన్ గుర్తింపు
- మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న దువ్వాడ పోలీసులు
- గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు


ఏలేరు కాలువలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు


కాలువ ఒడ్డున చెప్పులు


సెల్ఫీ వీడియోలో రోదిస్తున్న ఉక్కు ఉద్యోగి వరప్రసాద్, అతని భార్య

కూర్మన్నపాలెం: 'మేము వెళ్లిపోతున్నాం.. అంతా జాగ్రత్తగా ఉండండి. తమ్ముడిని, నాన్నమ్మను జాగ్రత్తగా చూసుకోండి. అల్లుడు గారు.. నా కూతురు అమాయకురాలు.. జాగ్రత్తగా చూసుకోండి.. మీకు ఇవ్వాల్సింది ఇవ్వకుండానే వెళ్లిపోతున్నాం. మమ్మల్ని క్షమించండి.. బైబై..'అంటూ ఓ దంపతుల సెల్ఫీ వీడియో సంచలనం సృష్టించింది. గాజువాకలోని వడ్లపూడి పరిధి తిరుమలనగర్‌లో కలకలం సృష్టించిన ఉక్కు ఉద్యోగి, అతని భార్య మిస్సింగ్ మిస్టరీ వీడలేదు. వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. వారి కుమార్తె, పోలీసులు తెలిపిన వివరాలివీ.. వడ్లపూడి తిరుమలనగర్‌లో ఉంటున్న చిత్రాడ వరప్రసాద్(47) స్టీల్‌ప్లాంట్‌లో మాస్టర్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ.. ప్రైవేట్‌గా శ్రీదుర్గా బ్యాటరీ కేర్ షాప్‌ను నడుపుతున్నారు.

భార్య మీరా(41), 19 ఏళ్ల కుమారుడు కృష్ణసాయితేజతో కలిసి వెంకటేశ్వర పారాడైజ్–2 అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. కుమార్తె దివ్యలక్ష్మికి గతేడాది కణితి గ్రామానికి చెందిన మరో ఉక్కు ఉద్యోగితో ఘనంగా వివాహం జరిపించారు. ఈ క్రమంలో వరప్రసాద్ తెలిసిన వాళ్లు, తోటి ఉద్యోగుల దగ్గర సుమారు రూ.60లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో అప్పులిచ్చిన వారంతా నిత్యం డబ్బులు చెల్లించాలని ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నారు. అప్పుల బాధ భరించలేని వరప్రసాద్, అతని భార్య మీరా సోమవారం ఉదయం 11 గంటలకు కూతురు దివ్య లక్ష్మికి ఫోన్ చేసి తమ్ముడిని, నాన్నమ్మను జాగ్రత్తగా చూసుకోమని ఆవేదనతో మాట్లాడారు. కంగారుపడిన దివ్యలక్ష్మి తల్లిదండ్రుల వద్దకు వచ్చి ధైర్యం చెప్పింది. మీరు ఏమీ చేసుకోవద్దు. అటువంటి ఆలోచనలు ఉంటే తమ్ముడు మీద ఒట్టు అని ఒట్టు వేయించుకుంది. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి తన అత్తవారింటికి వెళ్లిపోయింది. కొడుకు కృష్ణసాయి తేజ, నాన్నమ్మ షాప్ నుంచి 2 గంటలకు ఇంటికి వచ్చారు. తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి మళ్లీ తిరిగి షాప్‌కు వెళ్లిపోయారు. సాయంత్రం 6 గంటలకు ఇంటికి వచ్చిన కృష్ణసాయితేజకు అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ ఇంటి తాళాలు ఇచ్చాడు.

అమ్మానాన్న ఎక్కడికి వెళ్లారని వాచ్‌మన్‌ను అడగ్గా.. తెలియదంటూ జవాబు ఇచ్చాడు. కంగారు పడిన కృష్ణసాయితేజ ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై ఫ్యామిలీ ఫొటో, తల్లి మొబైల్‌లో సెల్ఫీ వీడియో ఉంది. వెంటనే తండ్రి వరప్రసాద్‌కు ఫోన్ చేశాడు. 5, 10 నిమిషాల్లో ఇంటికి వస్తానని చెప్పిన తండ్రి.. ఎంత సేపైనా ఇంటికి రాలేదు. మరలా ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తెలిసిన వాళ్లకు ఫోన్ చేసి ఆరా తీశాడు. ఆచూకీ తెలియకపోవడంతో వెంటనే దువ్వాడ పోలీసులకు జరిగిన విషయాన్ని చెప్పాడు. పోలీసుల వరప్రసాద్ ఫోన్ లొకేషన్‌ను ట్రాక్ చేశారు. లొకేషన్ ఆధారంగా అనకాపల్లి జిల్లా కొప్పాకలోని ఏలేరు కాలువ వద్ద వరప్రసాద్, అతని భార్య మీరాకు సంబంధించిన చెప్పులు, బ్యాగు, ఫోన్, బైక్‌ను గుర్తించారు. ఐదుగురు గజ ఈతగాళ్లను రప్పించి సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి మళ్లీ గాలింపు చర్యలు కొనసాగుతాయని అనకాపల్లి ఎస్‌ఐ సీహెచ్ నర్సింగరావు తెలిపారు. సాయితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పరువు పోతుందనే భయంతోనేనా..?**

చిత్రాడ వరప్రసాద్ ఉక్కు ఉద్యోగి. వరుస సంఘటనలు ఆయన్ని అప్పుల పాల్జేశాయి. వెన్నునొప్పితో తీవ్రంగా బాధపడుతున్నాడు. గతంలో భార్యాభర్తలిద్దరికీ కరోనా సోకింది. గతేడాది కుమార్తె దివ్యలక్ష్మికి వివాహం చేశాడు. అప్పు చేసి కుమారుడితో ఓ బ్యాటరీ షాపు పెట్టించాడు. తోటి ఉద్యోగుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు చేయడం, అప్పు ఇచ్చినవారు నిత్యం ఇంటికి వచ్చి అప్పు తీర్చాలంటూ ఒత్తిడి చేయడంతో వరప్రసాద్ మానసికంగా కుంగిపోయాడు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెరమీదకు రావడం, అప్పుల ఇచ్చిన వాళ్లు అధిక ఒత్తిడి తీసుకురావడంతో.. వాటిని ఎలా తీర్చాలంటూ కుటుంబ సభ్యులకు చెప్పి నిత్యం ఆవేదన చెందేవారు. కాగా.. అప్పులు ఇచ్చిన వారి వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకున్నారా? వారు ఎక్కడైనా ఉన్నారా? మరే ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.